తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో శాసనమండలి విపక్షనేత మధుసూదనాచారి, ఎమ్మెల్సీలు మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, శేరి సుభాష్‌రెడ్డి, మాజీమంత్రులు జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, విజయుడు, మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, పద్మాదేవేందర్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, గొంగిడి సునీత, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డి

లోకం పోకడ



ప్రజాజీవితంలో నో రిటైర్మెంట్

- ప్రజల్లో ఉండండి.. ఫలితం దక్కుతది
- ఎన్నికలొస్తే ప్రజలే గెలిపిచుకుంటరు
- ఉమ్మడి రాష్ట్రంలో మున్సిపాలిటీలు, గ్రామాలు మురికికూపాలుగా ఉండేవి
- పదేండ్లలో మోడల్‌గా మారాయి
- మోసపూరిత హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది
- ఢిల్లీ పెద్దలకు టకీటకీమని పైసలు పడుతున్నయ్
- కోమటిరెడ్డి నల్లగొండ అభివృద్ధిని పట్టించుకోవడం లేదు
- మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్స్ సన్మానోత్సవంలో కేటీఆర్



కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పదవీ కాలం పూర్తి చేసుకున్న సీతాలక్ష్మిని సన్మానిస్తున్న కేటీఆర్

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ): 'మనం ప్రభుత్వ ఉద్యోగులం కాదు.. 61 ఏండ్లకు రిటైర్మెంట్ కావడానికి! ప్రజా జీవితంలో రిటైర్మెంట్ అనేది ఉండదు. పదవీకాలం ముగిసిన మున్సిపల్, కార్పొరేషన్ల చైర్‌పర్సన్లు, చైర్మన్లు, కౌన్సిలర్లు ప్రజల్లోనే ఉండాలి. మళ్లీ ఎన్నికలు వస్తే ప్రజలు గెలిపించుకుంటారు' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పిలుపునిచ్చారు. పదవీకాలం ముగిసిన మున్సిపాలిటీలు, కార్పొరేషనల్లో బీఆర్ఎస్ పార్టీకి చెందిన చైర్‌పర్సన్లు, చైర్మన్లు, వైస్ చైర్మన్లకు తెలంగాణభవన్‌లో శుక్రవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 'ఉమ్మడి రాష్ట్రంలో మున్సిపాలిటీలు మురికి కూపాలుగా ఉండేవి. బల్దియాలు అంటే ఖాయా పియా చల్దియా అనే సామెత ఉండేది. కానీ, బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేసీఆర్ పట్టణాల అభివృద్ధి కోసం ప్రత్యేక విజన్‌తో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. కేసీఆర్ మార్గదర్శనంలో తెలంగాణలోని పట్టణాలను మాడల్ పట్టణాలుగా తీర్చిదిద్దాం. ఆర్థిక ఇంజన్లుగా ఉన్న పట్టణాలను, వాటి సమగ్రంగా డెవలప్‌చేయాలని అనేక కార్యక్రమాలు చేపట్టాం. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి లక్ష్యంగా పదేండ్లు పనిచేసి గ్రామాలను, పట్టణాలను అన్ని అంశాల్లో అభివృద్ధి చేశాం. దేశ జనాభాలో 3% ఉన్న తెలంగాణకు జాతీయస్థాయిలో 30% అవార్డులు వచ్చాయి. మన పనితీరుకు ఆ అవార్డులే నిదర్శనం' అని వివరించారు. మోసపూరిత 420 హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు పాలన చేయడం రావడం లేదని దుయ్యబట్టారు. టకీ టకీమని రైతులకు పైసలు పడుతాయన్నారు.. కానీ, టకీటకీమని ఢిల్లీలో పైసలు పడుతున్నాయని ఎద్దేవా చేశారు.

> పదవీకాలం ముగిసిన చైర్మన్లు, కౌన్సిలర్లు ప్రజల్లోనే ఉండాలి. ప్రజలకు అందుబాటులో ఉంటే ఫలితం దక్కుతుంది. మళ్లీ ఎన్నికలు వస్తే ప్రజలే మనల్ని గెలిపించుకుంటారు. 2028లో విజయం మనదే. -కేటీఆర్

డైలాగులు కొడితే అభివృద్ధి కాలేదు

బీఆర్ఎస్ హయంలో పదేండ్లపాటు జరిగిన పట్టణాల అభివృద్ధి కేవలం డైలాగులు కొడితే కాలేదని కేటీఆర్ చెప్పారు. పక్కా ప్రణాళికతోపాటు అవసరమైన సంస్కరణలు, నిరంతర పర్యవేక్షణ, అవసరమైన నిధులు అందించడం వంటి నిరంతర ఫోకస్‌తోనే తెలంగాణలోని పట్టణాలు మాడల్ పట్టణాలుగా తయారయ్యాయని చెప్పారు. పదేండ్లుగా మున్సిపల్ చైర్‌పర్సన్లు, కౌన్సిలర్లు పట్టణాల అభివృద్ధి కోసం అద్భుతంగా పనిచేశారని, అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి పూర్తి చేశారని కొనియాడారు. బీఆర్ఎస్ హయాంలో పెద్ద ఎత్తున పరిపాలన వికేంద్రీకరణ కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. కొత్త జిల్లాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు పరిపాలన మరింత దగ్గర అయిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినాక కొత్తగా కట్టాల్సిందిపోయి హైడ్రా, మూసీ ప్రాజెక్టుల పేరుతో కూలగొడుతున్నదని మండిపడ్డారు. ప్రభుత్వాన్ని నడిపే వారి ఆలోచనలు సానుకూలంగా ఉంటే రాష్ట్రం, పట్టణాలు అభివృద్ధి చెందుతాయని చెప్పారు.

కోమటిరెడ్డి అభివృద్ధిని పట్టించుకోలేదు

నల్లగొండ పట్టణాన్ని సమూలంగా అభివృద్ధి చేసిన తనపై, కాంగ్రెస్ మంత్రులు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. సీనియర్ అయ్యుండి కూడా కోమటిరెడ్డి పట్టణ అభివృద్ధిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. నల్లగొండలో నాలుగు నెలలుగా జీతాలు అందడం లేదని సిబ్బంది ఆందోళనలు చేపట్టినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఆరున్నర లక్షల కొత్త రేషన్‌కార్డులను గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చినప్పటికీ, కాంగ్రెస్ పార్టీ మాత్రం రేషన్‌కార్డులు ఇవ్వలేదని అబద్ధాలు చెప్తున్నదని విమర్శించారు. డూప్లికేట్ గాంధీలకు తెలంగాణ ఇచ్చిన హామీలను అమలుచేసేలా బుద్ధి ప్రసాదించాలని మహాత్ముడి విగ్రహాలకు వినతిపత్రాలు ఇచ్చినట్టు గుర్తుచేశారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీకి చెందిన మున్సిపల్ కార్పొరేషన్ చైర్‌పర్సన్లు, చైర్మన్లు, వైస్ చైర్మన్లకు కుటుంబసమేతంగా శాలువా కప్పి, జ్ఞాపికను అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, ఎమ్మెల్సీలు మహమూద్ అలీ, సత్యవతిరాథోడ్, నవీన్‌కుమార్ రెడ్డి, మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, చామకూర మల్లారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, విజయుడు, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, పైళ్ల శేఖర్ రెడ్డి, గొంగిడి సునీత, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, బాల్క సుమన్, శంకర్ నాయక్, కోరుకంటి చందర్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ పద్మాదేవేందర్‌రెడ్డి, నాయకులు వంటేరు ప్రతాప్ రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

> బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధితో పట్టణాలతోపాటు ప్రజల ఆస్తుల విలువ కూడా పెరిగింది. ఉమ్మడి రాష్ట్రంలో ఎకరం ధర రూ.3 లక్షలు ఉంటే, కేసీఆర్ పాలనలో 30 లక్షలు పలికింది. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే పట్టణాల్లో అభివృద్ధి కుంటుపడింది. ప్రజల ఆస్తుల విలువ కూడా భారీగా పడిపోయింది. -కేటీఆర్

రాష్ట్రంలో పెరుగనున్న ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో నేటి నుంచి ఉష్ణోగ్రతలు క్రమేపీ పెరుగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. తూర్పు, ఈశాన్య, వాయవ్య గాలులతో నాలుగు రోజులపాటు పొగమంచు కురిసే అవకాశమున్నదని పేర్కొన్నది. పలు జిల్లాల్లో సాధారణం, మరికొన్ని జిల్లాల్లో సాధారణం కంటే ఒక డిగ్రీ అధికంగా ఉష్ణోగ్రతలు నమోదుతున్నాయని వెల్లడించింది. గాలుల దిశలో మార్పుల కారణంగా ఫిబ్రవరిలో ఒక వారం చల్లగా, మరో వారం వేడిగా ఉండే అవకాశమున్నట్టు తెలిపింది. మార్చి నుంచి అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని స్పష్టంచేసింది. రాష్ట్రంలోకి తూర్పు, ఆగ్నేయ గాలులు వీస్తుండడంతో వారంపాటు చలి ఉంటుందని, ఫిబ్రవరి రెండోవారం వరకు కొన్నిసార్లు వేడి, కొన్నిసార్లు చల్లగాలులు వీస్తాయని, మూడో వారం నుంచి ఉష్ణోగ్రతల్లో పెరుగుదల స్పష్టంగా కనిపించనున్నట్టు వివరించింది.

నియంత పాలనకు నిదర్శనం : ఆర్ఎస్పీ

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ): వికారాబాద్ జిల్లా పరిగి దాస్యా నాయక్‌తండాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొనే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మైక్ పర్మిషన్ నిరాకరించడం దారుణమని ఆ పార్టీ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మండిపడ్డారు. ఇది ఉగాండాలో నియంత 'ఈదీ అమీన్' పాలనను గుర్తుకు తెస్తున్నదని ఎక్స్‌వేదికగా విమర్శించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 భావ ప్రకటన స్వేచ్ఛను ప్రతీ పౌరునికి ఇచ్చిందన్న కనీస అవగాహన లేని అజ్ఞానుల చేతిలో తెలంగాణ బందీ కావడం దురదృష్టమని పేర్కొన్నారు.

కాంగ్రెస్ అడ్డంకులు దారుణం: బాల్క సుమన్

కేటీఆర్ హాజరయ్యే అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మైక్‌కు అనుమతి నిరాకరిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డంకులు సృష్టించడం దారుణమని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మండిపడ్డారు. 'ప్రజాపాలన అని ఊదరగొట్టే కాంగ్రెస్ ప్రభుత్వం.. హైదరాబాద్‌లోని అత్యంత ఎత్తైన అంబేద్కర్ విగ్రహ నిర్వహణలో వివక్ష చూపుతున్నది. పరిగిలో అంబేద్కర్ విగ్రహావిష్కరణలో అడ్డంకులు సృష్టిస్తున్నది' అని ఎక్స్ వేదికగా విమర్శించారు.

హామీల అమలుకు 3,4న నిరుద్యోగ దీక్ష

- కాంగ్రెస్ బహిష్కృత నేత బక్క జడ్సన్ ఫైర్

చిక్కడపల్లి, జనవరి 31: నిరుద్యోగుల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వారిని మోసం చేస్తుందని కాంగ్రెస్ బహిష్కృత నేత బక్క జడ్సన్ విమర్శించారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఈ నెల 3,4న ఇందిపార్క్ ధర్నాచౌక్ వద్ద 48 గంటలపాటు నిరుద్యోగ దీక్ష చేపడుతున్నట్టు వెల్లడించారు. శుక్రవారం చిక్కడపల్లిలోని నగర గ్రంథాలయ ప్రాంగణంలో దీక్ష పోస్టర్‌ను నిరుద్యోగ జేఏసీ నాయకుడు జనార్దన్‌తో కలిసి ఆవిష్కరించారు. కాంగ్రెస్ జాతీయ నాయకులు ప్రియాంకాగాంధీ, రాహుల్‌గాంధీ అశోక్‌నగర్‌లో యూత్ డిక్లరేషన్ ప్రకటించారని, జాబ్ క్యాలెండర్ పెడుతామని చెప్పారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా హామీలు అమలు చేయలేదని, ఇప్పటి వరకు జాబ్ క్యాలెండర్ ఇవ్వలేదని మండిపడ్డారు. మూసీ ప్రక్షాళన అభివృద్ధిలో కమీషన్లు వస్తాయి కాబట్టే దానిపై దృష్టి పెట్టారని, ఉద్యోగాలు ఇస్తే నిరుద్యోగులు ఏమీ ఇవ్వరనే వారిపై వివక్ష చూపుతున్నారని పేర్కొన్నారు. నిరుద్యోగ నిరాహార దీక్షను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

బీసీ సర్కార్ కోసమే యుద్ధభేరి

- ఓట్లు మావే... సీట్లూ మావే
- 42శాతం రిజర్వేషన్లు వెంటనే అమలు చేయాలి
- ఈడబ్ల్యూఎస్ తక్షణమే రద్దు చేయాలి
- ఆర్ట్స్ కాలేజీలో యుద్ధభేరి సభ ఆరంభం మాత్రమే
- జింఖానాగ్రౌండ్‌లో విజయభేరి
- కుడామాజీ చైర్మన్ సుందర్‌రాజ్

హనుమకొండలోని ఆర్ట్స్ కాలేజీ మైదానంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సుందర్‌రాజ్‌యాదవ్

హనుమకొండ చౌరస్తా, జనవరి 31 : హనుమకొండలోని ఆర్ట్స్ కాలేజీ మైదానంలో ఈ నెల 2న నిర్వహించే బీసీ రాజకీయ యుద్ధబేరి సభ బీసీ సర్కార్ కోసమేనని కుడా మాజీ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ పేర్కొన్నారు. ఇది ఆరంభ సభ మాత్రమేనని, 15 లక్షల మందితో హైదరాబాద్ జింఖానా గ్రౌండ్‌లో విజయభేరి మోగిస్తామని చెప్పారు. బీసీ వరంగల్ జేఏసీ చైర్మన్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ నియోజకవర్గ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ హనుమకొండలోని ఆర్ట్స్ కాలేజీ మైదానంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. హనుమకొండలో రేపు నిర్వహించే రాజకీయ యుద్ధబేరి సభ.. విజయ భేరి సభగా మారబోతున్నదని తెలిపారు. రానున్న రోజుల్లో బీసీల ఐక్యతతో తమ సత్తా ఏంటో చూపిస్తామన్నారు. దశాబ్దాలుగా 'మాతో ఓట్లు వేయించుకుంటూ.. మీరు గద్దె మీద కూర్చుంటున్నారని, బీసీలమంతా ఏకమయ్యామని, ఇక నుంచి ఓట్లు మావే.. సీట్లూ మావేనని' స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌తోపాటు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లో మొదలు పెట్టి, ఎమ్మెల్యే, ఎంపీ సీట్లలో సైతం 50శాతం సీట్లు కేటాయించాలని, లేకపోతే బీసీలమంతా ఏకమైతే పార్టీలకు పుట్టగతులుండవని హెచ్చరించారు. 6.2 శాతం ఉన్న ఉన్నతవర్గాలకు 10శాతం రిజర్వేషన్లు ఎందుకని ప్రశ్నించారు. వెంటనే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను రద్దు చేయాలని, లేకపోతే ఎస్సీ, ఎస్టీ, బీసీల ఆగ్రహానికి గురికాకతప్పదని హెచ్చరించారు. వరంగల్‌లో ఆరంభమైన సభ జింఖానా గ్రౌండ్‌లో విజయభేరి సభగా ముగుస్తుందని చెప్పారు.

ఎమ్మెల్సీగా ఆశీర్వదించండి..

ఖమ్మం-నల్గొండ-వరంగల్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీగా ఇండిపెండెంట్‌గా ఆశీర్వదించాలని సుందర్‌రాజ్ కోరారు. 32 సంవత్సరాలుగా విద్యావ్యవస్థలో ఉన్న తనకు ఉపాధ్యాయుల సమస్యలు తెలుసని చెప్పారు. అటు ప్రభుత్వ విద్యావ్యవస్థ, ఇటు ప్రైవేట్ విద్యావ్యవస్థపై అవగాహన ఉన్న వ్యక్తిగా మండలిలో ఉపాధ్యాయుల సమస్యలపై గళమెత్తుతానని తెలిపారు.

వర్గీకరణ చేస్తే పదవి పోతుందని సీఎంకు భయం

- ఖర్గే, కొప్పుల రాజు వర్గీకరణకు అడ్డుపడుతున్నరు
- ఉద్యమ కాలం నుంచి వర్గీకరణకు అండగా కేసీఆర్
- మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ): ఎస్సీ వర్గీకరణకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఆ పార్టీ ముఖ్యనేత కొప్పుల రాజు అడ్డుపడుతున్నారని, వారినికాదని వర్గీకరణ చేస్తే తన పదవి ఊడుతుందని సీఎం రేవంత్‌రెడ్డి భయపడుతున్నారని మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య విమర్శించారు. తెలంగాణభవన్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన రోజే రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ అమలుచేస్తామని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించారని గుర్తుచేశారు. మాదిగలకు రేవంత్ మద్దతిస్తున్నట్టు చెప్తూ తెరవెనక మాలలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. రేవంత్ తీరుతో మాదిగ బిడ్డలు ఉద్యోగ నియామకాల్లో నష్టపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. ఉద్యమ సమయంలో, తెలంగాణ ఏర్పాటుతర్వాత ఎస్సీ వర్గీకరణకు కేసీఆర్ అండగా నిలిచారని గుర్తుచేశారు. రెండుసార్లు వర్గీకరణకు అనుకూలంగా కేసీఆర్ ప్రభుత్వం తీర్మానం చేసిందని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ డిమాండ్ చేస్తూ కేసీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ బృందం మోదీని కలిసినట్టు గుర్తుచేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే వివేక్ కుటుంబం వర్గీకరణ ఆపాలని కుట్ర చేస్తున్నట్టు ఆరోపించారు. రేవంత్ మంత్రివర్గంలో మాదిగలకు చోటు ఇవ్వలేదని విమర్శించారు. ఫిబ్రవరి 10లోగా ఎస్సీ వర్గీకరణ అమలుచేయకపోతే బీఆర్ఎస్ తరపున కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు.

సింగరేణి కార్మికుడి ఆత్మహత్య

- సీనియారిటికి తగ్గ పోస్టింగ్ ఇవ్వకుండా వేధింపులు!
- 10 రోజులు అధికారులను వేడుకున్నా జరగని న్యాయం
- ఆవేదనకు గురై కరీంనగర్‌లోని నివాసంలో ఆత్మహత్య

సంతోష్ (ఫైల్)

రామగిరి జనవరి 31: తెలంగాణలో కాంగ్రెస్ ఏడాది పాలనలో రైతులు, చేనేత కార్మికులు, ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలు నిత్యకృత్యమయ్యాయి. తాజాగా వ్యాపారం కుదేలైపోవడంతో ఓ బిల్డర్ కూడా ఆత్మహత్యకు పాల్పడ్డాడంటే తెలంగాణలో జీవనపోరాటం ఎంత దుర్భరంగా మారిందో అర్థం చేసుకోవచ్చు. ఇదే క్రమంలో కరీంనగర్‌లో ఓ సింగరేణి కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు నుంచి పెద్దపల్లి జిల్లా ఆర్జీ-3 డివిజన్‌కు బదిలీ అయిన కార్మికుడు సంతోష్ ఉరివేసుకుని చనిపోయాడు. సీనియారిటీ ప్రకారం పోస్టింగ్ ఇవ్వకుండా అధికారులు వేధింపులకు గురి చేయడంతోనే సంతోష్ మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నట్టు తోటి ఉద్యోగులు చెప్తున్నారు.

అవినీతితో విసిగిపోయి...!

జనవరి 21న ఓసీపీ -2 మైన్‌కు పోస్టింగ్ కోసం సంతోష్ దరఖాస్తు పెట్టుకునేందుకు జీఎం కార్యాలయంలో అధికారులను కోరాడు. కానీ ఈ నెల 17న పోస్టింగ్ సిద్ధమైందని సదరు అధికారి స్పష్టంచేశాడు. మణుగూరు నుంచి 21న రిలీవ్ అయితే, ఆర్జీ-3లో 17న పోస్టింగ్ ఎలా సిద్ధమవుతుందని సంతోష్ ప్రశ్నించాడు. ఆరోజు నుంచి శుక్రవారం వరకు పోస్టింగ్ కోసం ప్రయత్నించి, అధికారి తప్పిదం వల్ల పోస్టింగ్ రావడం లేదని మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నారని కార్మిక సంఘం నేతలు చెప్తున్నారు. సింగరేణి అధికారులు తమ అవినీతితో కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు.

జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ శివప్రసాద్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న బీఆర్ఎస్ కార్పొరేటర్లు మన్నె కవితారెడ్డి, సామల హేమ, సునీత, సింధూ ఆదర్శరెడ్డి, శాంతిరెడ్డి, దేవీప్యరావు తదిదరులు

జీహెచ్ఎంసీలో బీఆర్ఎస్ కార్పొరేటర్ల ఆందోళన

- కమిషనర్, మేయర్ చాంబర్ల వద్ద బైఠాయింపు
- తమపై దాడిచేసినవారిపై చర్యలకు డిమాండ్

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 31 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ పాలకమండలి సమావేశంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు వ్యవహరించిన తీరుకు నిరసనగా బీఆర్ఎస్ కార్పొరేటర్లు శుక్రవారం కూడా ఆందోళన కొనసాగించారు. బీఆర్ఎస్ కార్పొరేటర్లంతా మూకుమ్మడిగా శుక్రవారం ఉదయమే జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకొని నిరసన ప్రదర్శన చేపట్టారు. ప్రధాన కార్యాలయం గేటు వద్ద నిల్చొని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మేయర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం జీహెచ్ఎంసీ కమిషనర్ చాంబర్, మేయర్ చాంబర్ల వద్ద బైఠాయించారు. కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో అడిషనల్ కమిషనర్ శివప్రసాద్‌నాయుడుకు వినతిపత్రం అందజేశారు. నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి చర్చ లేకుండా జీహెచ్ఎంసీ బడ్జెట్‌ను ఆమోదించారని, బీఆర్ఎస్ మహిళా కార్పొరేటర్లపై కాంగ్రెస్ కార్పొరేటర్లు అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా దాడులు చేశారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ కార్పొరేటర్లు మన్నె కవితారెడ్డి, సామల హేమ, ఆర్ సునీత, సింధూ ఆదర్శరెడ్డి, శాంతిరెడ్డి, దేవీప్యరావుతో కూడిన బృందం శివప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు.

కానిస్టేబుల్ సూసైడ్

- విధుల్లో ఒత్తిడి భరించలేక ఆత్మహత్య!
- జత కలిసిన ఆర్థిక కారణాలు
- మాదన్నపేట పీఎస్‌లో విధులు
- అంబర్‌పేట నివాసంలో సూసైడ్

వెంకటేశ్వర్లు (ఫైల్)

గోల్నాక, జనవరి 31: తెలంగాణ పోలీస్‌శాఖలో మరో కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నాడు. హైదరాబాద్ మాదన్నపేట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. అంబర్‌పేట్ దుర్గానగర్‌లోని నివాసంలో ఉరివేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు. అంబర్‌పేట్ సీఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేటకు చెందిన వెంకటేశ్వర్లు (42)కు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. 2007 బ్యాచ్‌కు చెందిన వెంకటేశ్వర్లు గురువారం ఇంట్లో ఉరి వేసుకున్నాడ కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు చెప్పారు. మరోవైపు కొంతకాలంగా పోలీస్‌శాఖలో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నట్టు కానిస్టేబుళ్ల నుంచి అధికారుల వరకు వివిధ సందర్భాల్లో ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. బెటాలియన్ కానిస్టేబుళ్ల కుటుంబాలు రోడ్డెక్కిన ఘటనలు సంచలనం రేకెత్తించాయి. పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఆత్మహత్యలపై పలువురు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం దృష్టి సారించాలని, క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సమస్యలను తెలుసుకుని, పరిష్కారం చూపాల్సిన అవసరముందని ఉద్యోగ సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

కోడ్ సాకుతో పథకాలు ఆపొద్దు

- అవసరమైతే ఎన్నికల సంఘానికి లేఖ రాస్తాం
- కేంద్రసహాయమంత్రి బండి సంజయ్ వెల్లడి

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల కోడ్ సాకుతో పథకాలను నిలిపివేసేందుకు కుట్ర చేస్తున్నదని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ ఆరోపించారు. తక్షణమే అఖిలపక్ష సమావేశం నిర్వహించి రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు పథకాలను మంజూరు చేయాలని శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అవసరమైతే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ద్వారా ఈసీకి లేఖ పంపేందుకు సిద్ధమని చెప్పారు. ఏడాదిగా రైతుభరోసా అందక అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారని, గిట్టుబాటు ధర రాక, పెట్టుబడులు పెరిగి ఇబ్బందుల్లో ఉన్నారని చెప్పారు. ఇలాంటి సమయంలో చేతికందే సొమ్మును కూడా ఆపేస్తే రైతు నోట్లో మట్టికొట్టినట్టే అవుతుందని తెలిపారు.

ప్రాణం తీసిన రమ్మీ

శంకరపట్నం, జనవరి 31: ఆన్‌లైన్ రమ్మీ వ్యసనం ఓ యువకుడి ప్రాణం బలిగొంది. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం గద్దపాకకు చెందిన బూస శంకర్ కొడుకు కార్తీక్ (25) తండ్రితో కలిసి వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. ఈ నెల 28న కార్తీక్ పురుగుల మందు తాగి, తన స్నేహితుడికి తెలుపగా కుటుంబ సభ్యులు హన్మకొండలోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడం తో ఈ నెల 30న రాత్రి మృతి చెందా డు. తన కొడుకు ఆన్‌లైన్ రమ్మీకి బా నిసై డబ్బులు పోగొట్టుకొని, మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యా ప్తు చేస్తున్నట్టు ఎస్సై రవి తెలిపారు.